క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మెహబూబ్ షేక్



లబ్బీపేట(విజయవాడతూర్పు): వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా విజయవాడకు చెందిన మాక్సిల్లో ఫేషియల్ సర్జన్ డాక్టర్ మెహబూబ్ షేక్ నియమితులయ్యారు. వైఎస్సార్ సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఆదేశాలు జారీ చేసింది. పార్టీ ఆవిర్భావం నుంచి డాక్టర్ మెహబూబ్‌షేక్ పార్టీలో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లా వైద్య విభాగం అధ్యక్షులుగా దీర్ఘ కాలం పాటు పనిచేసిన ఆయన, మూడు నెలల క్రితం కృష్ణా, గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాలకు వైద్య విభాగం జోనల్ ఇన్‌,ఆర్జిగా నియమించారు. ఆయన సేవలను గుర్తించి వైద్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమించారు.

విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్):ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో గాంధీ జయంతినిపురస్కరించుకుని విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సబ్ జూనియర్స్, జూనియర్స్ విద్యార్థులకు గాంధీ చిత్రాలు గీయడంపై చిత్రలేఖనం పోటీలు జరిగాయి. సీనియర్స్ విభాగంలో గాంధీ జీవితంలో ముఖ్య సంఘటనలు- ఉద్యమాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

పోటీలకు విద్యార్థుల నుంచి చక్కని స్పందన లభించిందని గ్రంథాలయాధికారి రమాదేవి తెలిపారు. సుమారు 60 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. విజేతలకు గాంధీ జయంతి సందర్భంగా సోమవారం ఉదయం 10 గంటలకు గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్‌పర్సన్ జమల పూర్ణమ్మ బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది వై.ధనలక్ష్మి,కె.రాంబాబు, కుమార్, ఫణి బాబు, దుర్గాంబ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

పాయకాపురం(విజయవాడరూరల్):యువకుడు కనిపించడంలేదని నున్న పోలీసులకు వచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశారు. అబ్బినేని చాణక్య(28) మైలవరం కాలేజీలో రెండవ సంవత్సరం బీటెక్ చేసి కండ్రికలో పిన్ని.. ఊకంటి వసంతకుమారి ఇంట్లో ఉంటున్నాడు. గత నెల 27వ తేదీ నుంచి చాణక్య కనిపించడం లేదని వసంతకుమారి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



దుర్గాపురంలో పరిసరాలు శుభ్రం చేస్తున్న కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి



మధురానగర్‌లో పరిసరాలు శుభ్రం చేస్తున్న కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత తప్పక పాటించాలని 29వ డివిజన్ కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి అన్నారు. మధురానగర్‌లో ఆదివారం స్వచ్ఛతా హీ సేవలో భాగంగా వైఎస్సార్ సీపీ నాయకులు పారిశుద్ధ్య సిబ్బందితో కలిసి పరిసరాలు శుభ్రం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు డాక్టర్ పిల్లి జయకృష్ణ, కె.సుధాకర్, పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

దుర్గాపురంలో..

27వ డివిజన్ దుర్గాపురంలో కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి పారిశుద్ధ్య సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి పరిసరాలు శుభ్రం చేశారు. ప్రతి ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు కె.రాము, బ్రహ్మదేశం వసంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

32వ డివిజన్‌లో..

32వ డివిజన్ అయోధ్యనగర్‌లో పారిశుద్ధ్య సిబ్బందితో కలిసి వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి గుండే సుందర్‌పాల్ పరిసరాలు శుభ్రం చేశారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య సిబ్బంది, నేతలు పేరం త్రివేణి రెడ్డి పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

పాయకాపురం(విజయవాడరూరల్): ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ప్రాంతీయ ఆయుర్వేద రీసెర్చ్ సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం స్వచ్ఛతా హీ సేవలో భాగంగా 64వ డివిజన్ కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మతో కలిసి ప్రజాశక్తినగర్‌లో శ్రమదానం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు స్వచ్ఛతాహీ సేవ నిర్వహించినట్టు ఆయన తెలిపారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు యరగొర్ల శ్రీరాములు, షేక్ ఇస్మాయిల్, వెంకటేశ్వరమ్మ, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. 61వ డివిజన్‌లో కార్పొరేటర్ ఉమ్మడి రమాదేవి స్వచ్ఛతా హీ సేవను హెచ్ బ్లాక్ లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద శ్రమదానం చేశారు. కార్యక్రమంలో డివిజన్ నేతలు అవుటుపల్లి నాగరాజు, వెంకటేశ్వరావు, ఇన్‌స్పెక్టర్ శివకుమార్, స్థానికులు పాల్గొన్నారు. 62వ డివిజన్ కార్పొరేటర్ అలంపూరు విజయలక్ష్మి పార్టీ నేతలు అలంపూరు విజయ్, రామిరెడ్డి, సాయి. సుబ్బారెడ్డి, హైమావతి, మహేష్‌లతో కలిసిపైపులరోడ్డులోశ్రమదానం నిర్వహించారు.



32వ డివిజన్‌లో పరిసరాలు శుభ్రం చేస్తున్న నాయకులు



మొక్కను నాటుతున్న కార్పొరేటర్ తిరుపతమ్మ, డాక్టర్ బి.వెంకటేశ్వర్లు

వృద్ధుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

వృద్ధుల దినోత్సవ సభలో ఎమ్మెల్యే విష్ణు



వృద్ధులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వృద్ధుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. బందరులాకులు సమీపంలోని స్వాతంత్ర్య సమరయోధుల భవనంలో ఆదివారం వృద్ధులు, విభిన్న ప్రతిభావంతుల శాఖ, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అసోసియేషన్ ఆధ్వర్యాన 33వ ప్రపంచ వృద్ధుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పూర్వం రోజుల్లో పెద్దలంటే పిల్లలకు మర్యాద, గౌరవం ఉండేవని, నేడా పరిస్థితులు కనిపించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో విష్ణు మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థ ద్వారా వృద్ధులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఇంటి వద్దనే పెన్షన్ అందజేస్తున్నామన్నారు. వచ్చే ఏడాది జనవరి నుంచి పెన్షన్ 3 వేలకు చేరుతుందన్నారు. వైఎస్సార్ కంటి వెలుగు కింద వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి జోళ్లు అందజేస్తున్నట్లు తెలిపారు. 11 మంది వృద్ధులకు వినికిడి యంత్రాలు, చేతి కర్రలు పంపిణీ చేశారు. వివిధ రంగాల్లో సేవలు అందించిన వృద్ధులను సత్కరించారు. సంక్షేమ శాఖ సహాయ సంచాలకుడు వి. కామరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేమూరు బాబురావు, మోతుకూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ యువతరానికి, వృద్ధతరానికి మధ్య అంతరాలు తొలగిపోవాలన్నారు. ఉమ్మడి కుటుంబంలో సమస్యలు వస్తూ ఉంటాయని, వాటిని అధిగమించాలన్నారు. కార్యక్రమంలో మానసిక వికాస నిపుణులు కృష్ణకుమారి, మిమిక్రీ కళాకారులు సిల్వెస్టర్, సంఘం ప్రతినిధులు డి.సాంబశివరావు, నాదెళ్ల సుమతిదేవి తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో స్వచ్ఛతా హీ సేవ



ప్రభుత్వాస్పత్రి ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్న కేంద్ర ఆరోగ్య శాఖ డైరెక్టర్ హర్ష్ మంగ్లా, రాష్ట్ర ఆరోగ్యశాఖ కమిషనర్ జె నివాస్

లబ్బీపేట(విజయవాడతూర్పు): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆహ్లాదకర సమాజ నిర్మాణానికి దోహదం చేసిన వారవుతారని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ హర్ష్ మంగ్లా పేర్కొన్నారు. నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో(జీజీహెచ్) ఆదివారం స్వచ్ఛతాహీ సేవలో భాగంగా నిర్వహించిన అవగాహన, ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జీజీహెచ్ ప్రాంగణంలో చీపురు పట్టుకుని పరిసరాల్ని శుభ్రపరిచారు. చెత్తను తీసి సంచిలో వేశారు. అనంతరం ప్రాంగణంలోనే మొక్కలు నాటారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జె.నివాస్, నేషనల్ హెల్త్ మిషన్ స్టేట్ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ డి.వెంకట రవికృష్ణ, జగనన్న ఆరోగ్య సురక్ష స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ శ్యామల, ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ సుహాసిని, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ డి. వెంకటేష్ , డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ శోభ అధికారులు పాల్గొన్నారు.

సంఘ సంస్కర్త రఘుపతి వెంకటరత్నం నాయుడు



రఘుపతి వెంకటరత్నం నాయుడు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యావేత్త, సంఘసంస్కర్త రఘుపతి వెంకటరత్నంనాయుడు అని.. పేద విద్యార్థులు, వెనకబడిన వర్గాల సంక్షేమానికి ఆయన చేసిన సేవలు మరువలేనివని అల్లూరి సీతారామరాజు స్మారక గ్రంథాలయం అధ్యక్షుడు సుబ్బరాజు, సాంస్కృతిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్వీ సుబ్బరాజు అన్నారు. ముత్యాలంపాడు శ్రీ అల్లూరి సీతారామరాజు స్మారక గ్రంథాలయం వజ్రోత్సవాల్లో భాగంగా ఆదివారం రఘుపతి వెంకటరత్నం నాయుడు జయంతి కార్యక్రమం జరిగింది. వారు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంకటరత్నం నాయుడు ఆశయాలకు అనుగుణంగా యువత పని చేయాలని సూచించారు కార్యక్రమంలో సాంస్కృతిక సంఘం సహాయ కార్యదర్శి డి.భాస్కరరాజు, గ్రంథాలయం కార్యదర్శి పీవీ సుబ్బరాజు, కోశాధికారి టి.శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు మాంసం విక్రయాలు బంద్

పటమట(విజయవాడతూర్పు): గాంధీ జయంతి సందర్భంగా సోమవారం మాంసం, చేపలు మార్కెట్‌లకు విక్రయాలు బంద్ ప్రకటించామని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని కబేళా కూడా మూసేస్తామని, ఎవరైనా నిబంధనలను పాటించకుండా షాపులు తీసి వ్యాపారం చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వీఎంసీ కార్యాలయాల్లో నేటి స్పందన రద్దు

పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో, సర్కిల్ కార్యాలయాల్లో నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని సోమవారం రద్దు చేశామని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గాంధీ జయంతి సందర్భంగా కార్యక్రమాన్ని రద్దు చేశామని, మళ్లీ ఈ నెల 9వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

సీఎంఏ ఇంటర్ ఫైనల్ పరీక్షలో 'మోడరన్' విద్యార్థికి 15వ ర్యాంకు



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): సీఎంఏ ఇంటర్ ఫైనల్ పరీక్షలో తమ అకాడమీకి చెందిన కె.శివశక్తికి జాతీయ స్థాయిలో 15వ ర్యాంకు పొందారని మోడరన్ అకాడమీ చైర్మన్ ఎస్.పాపారావు ప్రకటనలో తెలిపారు. 37 సంవత్సరాలుగా తమ అకాడమీ ఈ పరీక్షా ఫలితాల్లో రికార్డుల పరంపర కొనసాగుతోందని పేర్కొన్నారు. సీఎంఏ ఇంటర్ ఫైనల్ విభాగంలో పరీక్షకు హాజరైన తమ అకాడమీ విద్యార్థులు మంచి ర్యాంకులతో ఉత్తీర్ణత పొందారని తెలిపారు. శివశక్తిని అకాడమీ అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

జాషువా సాహిత్యం సామాజిక అంశాలకు దర్పణం



అస్మదీయం, అనంత ఆకాశంలో కవితా సంపుటలను ఆవిష్కరిస్తున్న అతిథులు

విజయవాడ కల్చరల్: కవి జాషువా సాహిత్యం సామాజిక అంశాలకు దర్పణంగా భావించవచ్చని జాషువా కళాపరిషత్ వ్యవస్థాపకుడు పెద్దిటియోహాన్ అన్నారు. పద్మభూషణ్ జాషువా కళాపరిషత్ ఆధ్వర్యంలో ఎంజీరోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో ఆదివారం గుర్రం జాషువా 128 జయంతి వేడుకలు, కవి సమ్మేళనం, గ్రంథాల ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. యోహాన్ మాట్లాడుతూ జాషువా కవిత్వ వేదనాభరితమై సందేశాత్మకంగా సాగుతుందన్నారు. కళాపరిషత్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు గద్దం విజయరావు మాట్లాడుతూ జాషువా కవిత్వానికి ఎల్లలు లేవని తెలిపారు. కవయిత్రి డాక్టర్ సాంబేలు శాంతిబాయ్ మాట్లాడుతూ నేటి యువ కవులు ఆయన సాహిత్యాన్ని అధ్యయనం చేయాలని సూచించారు. సంపాదకుడు కలిమిశ్రీ, కవులు సిరికొండ నరసింహరాజు, శిఖా ఆకాష్, డాక్టర్ రంగిశెట్టి రమేష్ ప్రసంగించారు. అస్మతున్నీసా రచించిన అస్మదీయం, అనంత అకాశం, దాసరి ఆదినారాయణ రచించిన అనంత ఎర్ర సితార కవితా సంపుటలను ఆవిష్కరించారు. దాసన్నగారి కృష్ణమూర్తి, డాక్టర్ సాంబేలు శాంతిబాయ్‌లకు జాషువా విశిష్ట పురస్కారాలను, వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన కవులకు జాషువా పురస్కారాలను అందించారు. కవులు స్వీయకవితాగానం చేశారు.

అర్హతే ప్రామాణికం



లబ్ధిదారులకు పింఛను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ ఉమ్మడి రమాదేవి



పింఛన్ అందజేస్తున్న వలంటీర్ భాగ్యలక్ష్మి

పాయకాపురం(విజయవాడరూరల్): రాష్ట్ర ప్రభుత్వం పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా పేదలకు పింఛన్లు మంజూరు చేస్తోందని 61వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి రమాదేవి వెంకట్రావ్ అన్నారు. హెచ్ బ్లాక్‌లో లబ్ధిదారులకు వలంటీర్లతో వెళ్లి ఆదివారం పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జనవరి నుంచి పింఛను మూడు వేల రూపాయలను అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నేతలు ఉమ్మడి వెంకట్రావ్, వెంకటేశ్వరావు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

-62వ డివిజన్‌లో కార్పొరేటర్ అలంపూరు విజయలక్ష్మి, లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. నేతలు అలంపూరు విజయ్, రామిరెడ్డి, హైమావతి, సుబ్బారెడ్డి, వలంటీర్లు పాల్గొన్నారు.

-64వ డివిజన్ కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. నేతలు యరగొర్ల శ్రీరాములు, షేక్ ఇస్మాయిల్, వెంకటేశ్వరమ్మ, వలంటీర్లు పాల్గొన్నారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): దుర్గాపురంలో ఆదివారం తెల్లవారుజాము నుంచే పింఛన్ పంపిణీ చేశారు. వలంటీర్ భాగ్యలక్ష్మి వృద్ధులు, వితంతువుల ఇంటికి వెళ్ళి తలుపుతట్టి పింఛన్ అందజేశారు. కార్యక్రమంలో నేతలు కొండాయగుంట రాము పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింట్లు అయిన హైదరాబాద్, వనస్థలిపురం, శారదానగర్, ప్లాట్ నెం. 53 వాస్తవ్యులు 1. లేట్ దావు యెల్లేశ్వరరావు గారి భార్య దావు వెంకట లక్ష్మి, 2. కుమార్తె పీరుకి లావణ్య మరియు 3. కుమారుడు దావు నవీన్ కుమార్ మరియు గుంటూరు వాస్తవ్యులైన 4) దావు సాంబశివరావు, వారి భార్య 5) నాగమణి గార్ల యొక్క సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా :

ఈక్రింద ఉదహరించిన షెడ్యూలు దాఖలా స్థిరాస్తి నా క్లయింట్లలో 2 మరియు మూడు వార్లకు ముత్తాత గారైన శ్రీ దావు బుచ్చయ్య గారి స్వార్జితమై నా క్లయింట్లలో 1వ వారికి భర్త మరియు 2,3వ వార్లకు తండ్రి గారైన శ్రీ లేటు యెల్లేశ్వరరావు గారికి మహారాజశ్రీ అదనపు సబార్డినేట్ జడ్జ్, విజయవాడ వారి కోర్టు నందు ఓ.యస్.నెం. 83/1978లో ఐ.ఎ.నెం. 1351/1978గా గల పార్టిషన్ కేసు డిక్రీ ద్వారా సంక్రమించిన య.1.30 సెంట్లు, తదుపరి పై తెల్పిన శ్రీ లేటు యెల్లేశ్వరరావు సదరాస్తిని నిర్వివాదముగా, సంపూర్ణ హక్కు భుక్తములతో అనుభవించుచు ది. 06-06-2005న కాలంచేసియున్నారు. అప్పటినుండి నా క్లయింట్లలో 1 నుండి మూడవ వారలు సదరాస్తిని సదరు దావు యెల్లేశ్వరరావు గారికి చట్టబద్ధ వారసులుగా నిర్వివాదముగా జాయింటుగా అనుభవించుచూ ది. 06-11-2020న సదరాస్తిని వారి వారి నిర్దిష్ట వాటాల ప్రకారం విభజించుకొని శ్రీ విజయవాడ, గుణదల సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసు నందు దస్తావేజు సంఖ్య 6499/2020గా ది. 06-11-2020న రిజిస్ట్రేషన్ పొంది వారి వారి వాటాలను విడివిడిగా అనుభవించుచున్నారు. కాగా పైతెల్పిన దావు యెల్లేశ్వరరావు గారి సోదరుడైన సాంబశివరావు గారు తన భాగంగా సంక్రమించినట్టి ఆస్తిలో య. 0.5 సెంట్లను తన భార్య అయిన నాగమణి పేరిట శ్రీ విజయవాడ, గుణదల సబ్ రిజిస్ట్రార్ గారి ఆఫీసు నందు దస్తావేజు సంఖ్య 4823/2012 మరియు 4824/2012గా ది. 11-09-2012న రిజిస్ట్రేషన్ చేయగా తదుపరి నాగమణి గారు సదరాస్తిని అప్పటినుండి అనుభవించుచున్నారు. ఇట్టి స్థితిలో నా క్లైంట్లు సదరాస్తిలో నిర్మాణ పనులు చేయు నిమిత్తం ది. 06-11-2020న గుణదల సబ్ రిజిస్ట్రార్ వారి ఆఫీసు నందు దస్తావేజు సంఖ్య 7208/2020 గా షెడ్యూలు ఆస్తికి చెందిన 636.16 గ.ల స్థలమును రోడ్డు నిమిత్తం విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ వారికి ఇచ్చియున్నారు. కాగా విజయవాడ, మాచవరం వాస్తవ్యులైన అక్కుల అన్నపూర్ణమ్మ మరియు ఆమె కుమారులు కోటేశ్వరరావు, రామకృష్ణ, మనుమలు వగైరాలు నా క్లైంట్లకు చెందిన దిగువ షెడ్యూలు ఆస్తిపై వారికి హక్కులు కలవని సదరు రోడ్డు దానం పై మహారాజశ్రీ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు నందు W.P.No. 25378/2020గా వ్యాజ్యం దాఖలు చేయుట జరిగినది. ప్రస్తుతం సదరు వ్యాజ్యము పెండింగ్‌లో వున్నది. ఇట్టి స్థితిలో పై తెల్పిన అక్కుల అన్నపూర్ణమ్మ మరియు ఆమె కుమారులు, మనుమలు వగైరాలు నా క్లైంట్లకు చెందిన దిగువ షెడ్యూలు ఆస్తిపై వారికి హక్కులు కలవని ప్రచారం చేసుకొనుచూ చట్టరీత్యా అమలు కానటువంటి కొన్ని కాగితాలను సమర్పించి మరియు వారి పలుకుబడిని ఉపయోగించి సదరు స్థిరాస్తిపై ఖాళీ భూమి పన్ను (వేకెంట్ ల్యాండ్ టాక్స్)ను వారిపై విధింపచేసుకొని, చెల్లించి, సదరాస్తిపై ఇతరులతో లావాదేవీలు జరుపుటకు ప్రయత్నించుచున్నారని నా క్లైంట్లకు నమ్మకముగా తెలిసినది. సదరు ఖాళీ భూమి పన్ను (వేకెంట్ ల్యాండ్‌టాక్స్)పై నా క్లైంట్లు మహారాజశ్రీ కోర్టువారి ఎదుట వ్యాజ్యము నెరపుటకు సన్నద్ధమగుచున్నారు. కావున నా క్లైంట్లకు మాత్రమే హక్కులు గల్గిన దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిపై జరుపు లావాదేవీలు నా క్లైంట్లను బైండ్ చేయజాలవని మరియు అట్టి లావాదేవీలు జరిపిన వారు చట్టరీత్యా నా క్లైంట్లు తీసుకొను సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు బద్ధులగుదురని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

షెడ్యూలు : యన్.టి.ఆర్. జిల్లా, విజయవాడ, గుణదల సబ్-రిజిష్ట్రార్ వారి యిలాకా, జాగీర్ మాచవరం, పాత రెవిన్యూ సర్వే నెం. 6, బ్లాక్ నెం. 5, న్యూ రెవిన్యూ సర్వే నెం. 23లోని య. 1.81 సెంట్ల ఖాళీ స్థలమునకు హద్దులు : తూర్పు : ఇతరుల ఆస్థి, దక్షిణం : రోడ్డు, పడమర : ఇతరుల ఆస్తి, ఉత్తరం : రోడ్డు.

ఇట్లు, ఎస్. బాలాజీ, అడ్వకేట్, డి.నెం. 26-20-21ఎ, గాంధీనగర్, విజయవాడ.

250 మంది వృద్ధులకు వైద్య పరీక్షలు



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

మధురానగర్(విజయవాడసెంట్రల్): వృద్ధులను ఆదరించటం సామాజిక బాధ్యత అని వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ సేవలను వృద్ధులు వినియోగించుకోవాలని ట్రస్ట్ వైస్‌చైర్మన్ తేజ్‌రాజ్ సోలంకి సూచించారు. దుర్గాపురం విజయ్ నర్సింగ్ స్కూల్‌లో ఆదివారం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఆరోగ్య అవగాహన, ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఆయన మాట్లాడుతూ వృద్ధులకు ఆరోగ్య సేవలు అందించటంతో పాటు అవగాహన పెంపొందించటానికి ఆయుర్వేదం, హోమియో, అల్లోపతి వైద్యులతో వైద్య శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. వృద్ధుల అవసరాలకు అనుగుణంగా సేవలు అందిస్తున్నామని తెలిపారు. సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్న దాతలు, ట్రస్ట్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యనిపుణులు ఏవీఎస్‌కే ప్రసాద్, అల్లోపతి డాక్టర్ చంద్రభొట్ల ఆదిత్య, హోమియో డాక్టర్ కోనా వీరబ్రహ్మం ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అనంతరం 250 మందికి ఉచితంగా వైద్యపరీక్షలు చేసి అవసరమైన మందులు అందజేశారు.

ఇంటింటికీ వైద్య సేవలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): దేశ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా ఇంటింటికీ వైద్య సేవలు అందిస్తున్న ఘనత జగనన్న ప్రభుత్వానికే దక్కుతుందని 59వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ షాహినా సుల్తానా హఫీజుల్లా అన్నారు. అజిత్‌సింగ్‌నగర్‌లో ఆదివారం జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఆమె మాట్లాడుతూ విద్య వైద్య రంగాలకు పెద్దపీట వేస్తూ అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన ముఖ్యమంత్రి జగనన్నకు ప్రజలు బాసటగా నిలవాలన్నారు. అక్టోబర్ 11న అజిత్‌సింగ్‌నగర్ ఎంకే బేగ్ నగరపాలక సంస్థ పాఠశాలలో ఏర్పాటు చేసిన మెగా మెడికల్ క్యాంపును ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. అనుభవజ్ఞులైన వైద్యులు పరీక్షలు చేసి మెరుగైన చికిత్సలు చేయనున్నట్లు కార్పొరేటర్ తెలిపారు.

రేషన్ పంపిణీ సక్రమంగా జరగాలి



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేస్తున్న రేషన్ పంపిణీ ప్రక్రియ సక్రమంగా జరగాలని 59వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ షాహినా సుల్తానా హఫీజుల్లా అన్నారు. అజిత్‌సింగ్‌నగర్‌లో రేషన్ పంపిణీ ప్రక్రియను కార్పొరేటర్ ఆదివారం పరిశీలించారు. కార్డుదారులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్డుదారుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా పంపిణీ చేయాలని సిబ్బందికి సూచించారు.

'సిద్ధార్థ' ప్రాంగణంలో దసరా ఉత్సవాలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవ కమిటీ ఆధ్వర్యాన మొగల్రాజపురంలోని సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ ప్రాంగణంలో దసరా మహోత్సవాలు నిర్వహించనున్నట్లు కమిటీ జనరల్ సెక్రటరీ వైట్ల కృష్ణప్రసన్న తెలిపారు. ఈ నెల 15 నుంచి 24 వరకూ ఉత్సవాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. రోజూ ఉదయం కుంకుమార్చన, చండీ హోమం జరుగుతాయన్నారు. నిత్యం ఉదయం 11 నుంచి 12.30 వరకూ కల్యాణం, సాయంత్రం 5.30 నుంచి 6.30 వరకూ సామూహిక లలిత సహస్ర నామ పారాయణం ఉంటాయన్నారు. సాయంత్రం 7.30 నుంచి 9 గంటల వరకూ వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 23న అత్యంత వైభవోపేతంగా మహా ప్రభ మహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. చండీ హోమం, అమ్మవారికి కుంకుమార్చన, శాంతి కల్యాణంలో వ్యక్తిగతంగా పాల్గొనే వారు, దంపతులు నిర్వాహకకమిటీ 9281039498, 9010243499ను సంప్రదించవచ్చునని వైట్ల కృష్ణప్రసన్న తెలిపారు. కమిటీ చైర్మన్‌గా పారిశ్రామికవేత్త, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, వైస్ చైర్మన్లుగా సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు, ఆడిటర్ సుంకర అక్కయ్యానాయుడు , మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్య, దొంతిరెడ్డి లక్ష్మణ రెడ్డి, జాయింట్ సెక్రటరీలుగా చలువాది మల్లిఖార్జునశర్మ, బొమ్మారెడ్డి రామప్రసాద్‌రెడ్డి, ఇతర సభ్యులు ఉన్నారు.

ప్రజలు సంతోషంతో ఉండాలి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): గణనాథుని దివ్య ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని 59వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ షాహినా సుల్తానా హఫీజుల్లా ఆకాంక్షించారు. అజిత్‌సింగ్‌నగర్ రైల్వే ట్రాక్ రోడ్డులో జరుగుతున్న వినాయక చవితి మహోత్సవాలలో ఆమె ఆదివారం పూజలు చేశారు.

నవరస నటుడు అక్కినేని



విజయవాడ కల్చరల్: నవరస నటుడు అక్కినేని నాగేశ్వరరావు అని స్వరలయ సంగీత సంస్థ నిర్వాహకుడు ఆర్.ప్రభాకర్ అన్నారు. స్వరలయ సంస్థ ఆదివారం గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో సినీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి వేడుకలు, సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కృష్ణా జిల్లాకు చెందిన అక్కినేని స్వయం ప్రతిభతో ఉన్నత శిఖరాలకు చేరుకున్నారని అత్యున్నతమైన దాదాసాహెబ్ పురస్కారం లభించినట్లు తెలిపారు. గాయనీ గాయకులు బాల పృథ్వీరాజ్, రాజ్, రేవతి, భారతి, నాగమణి, వైఎస్ రామకృష్ణ.. అక్కినేని నటించిన 40 చిత్రాల్లోని పాటలు ఆలపించారు. నిర్వాహకులు అక్కినేని చిత్రపటానికి నివాళి సమర్పించారు.

సేవాభావంతో ఉండాలి



కేసీ గుప్తా, గాంధీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు నివాళులర్పిస్తున్న వాసవీ సభ్యులు

పాయకాపురం (విజయవాడరూరల్): ఆర్తులు, అన్నార్తుల పట్ల సేవాభావంతో ఉండాలని వాసవి క్లబ్బుల అంతర్జాతీయ మాజీ అధ్యక్షుడు వేముల హజరత్తయ గుప్తా తెలిపారు. వాసవి క్లబ్బుల ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని, రాజీవ్‌నగర్‌లోని అంతర్జాతీయ ప్రాంతీయ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. హజరత్తయ గుప్తా మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాసం, నిర్మలత్వం, నిస్వార్థ, నిజాయితీ, నిబద్ధత నిరాడంబరతతో మంచితనం ఉండాలని కల్వకుంట్ల చంద్రసేన గుప్తా 1961లో వాసవీక్లబ్‌ను స్థాపించారన్నారు. ఆయన ఆశయాలతో నేడు లక్షమంది పైబడి సభ్యులతో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ విరాజిల్లుతోందన్నారు. తొలుత కేసీ గుప్తా, మహాత్మాగాంధీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అంతర్జాతీయ ఉపాధ్యక్షులు మామిడి శ్రీనివాసరావు, జిల్లా గవర్నర్ మాజేటి రామచంద్రరావు, వైస్ గవర్నర్ కొత్త గణేష్‌బాబు, సునీత తదితరులు పాల్గొన్నారు.